# జీవితం

*Death is not the greatest loss in life, the greatest loss is what dies inside us while we live.*

***- Norman Cousis***

**మ**నిషి ఎక్కువగా భయపడేది దేనికి?! ఉపన్యాసం చేస్తున్న స్వామీజీ ప్రశ్నకు అందరూ మౌనం వహించారు.

ఆయన మళ్ళీ చెప్పాడు. అది నా స్వంత ప్రశ్నకాదు. ధర్మరాజుల వారిని భారతకాలంలో యక్షుడు అడిగిన యక్షప్రశ్న. మరి ఆనాడు ధర్మరాజు ఏం సమాధానం చెప్పాడో తెలుసా. మనిషిని భయపెట్టేవి వృద్ధాప్యం, మృత్యువు.

ఆ సమాధానం విన్న ఆ సభలోని సుందరయ్య 'ఔను, చావంటే ప్రతీ మనిషికీ భయమే. నాకు మాత్రం వృద్ధాప్యమే భీతికలిగిస్తోంది. అందుకే చావుని ఆహ్వానిస్తున్నాను. అదయినా సహజంగా రావాలి, రక్తనాడులు స్తంభించి గుండె నిర్ధయగా వీడ్కోలు చెప్పాలి' అనుకున్నాడు.

స్వామీజీ తన ఉపన్యాసం కొనసాగించాడు. "ఆత్మ భౌతిక శరీరాన్ని వదిలి,

స్వేచ్ఛగా దేవుడిలో లీనమవుతుంది. అయితే ఇచ్ఛామరణాన్ని కోరుకున్నవారు చరిత్రలో వున్నారు. హితుల్నీ తోబుట్టువుల్నీ, ఈ లోకాన్నీ విడిచి మరణాన్ని ఆవాహన చెయ్యడానికి నైతిక బలం కావాలి."

ఆ మాటలు కొరడాలా చెళ్ళున తగిలాయి సుందరయ్యకు, తన అంతరంగం ఆయన విప్పి చెపుతున్నాడా అనిపించింది.

తనకు ఈ రకమైన ఆలోచన రావడానికి కారణం ఎవరు? నెల క్రితం తనని వంటరివాడిని చేసి వెళ్లిపోయిన తన భార్య! కళ్లు రుద్దుతున్నాడు సుందరయ్య.

ఆ రోజు రాత్రి పదిదాటింది. తను నిద్రపోయాడు.. భార్య టీవీ చూస్తోంది. అంతలో ఆమెకు ఆయాసం, భర్తకు నిద్రాభంగం అవుతుందని కాబోలు చెప్పలేదు. ఆపిచ్చి ఇల్లాలు అరగంటసేపు పైగా బాధపడిందేమో, అప్పుడు చూసాడు తను మెలికలు తిరుగుతోంది... నోట్లోంచి మాట రావడం లేదు. గబ గబా ఆటో, పిలిచాడు, తన ఒడిలో పడుకుంది. ఏదో చెపుతోంది. ఐదు నిముషాల తర్వాత గాఢమైన నిశ్శబ్దం... అయినా తను ఆశ తీరక డాక్టరు తలుపు తట్టాడు.

ఆయన పరీక్ష చేసి చెప్పిందేమిటి?

సుందరయ్య కళ్లలో నీళ్ళు.. ఏమిటో ఈ ఒంటరితనం, ఇంట్లో తనొక్కడే. కొడుకులు, నలుగురూ దూరంగా... ఎవరింట్లోనూ ఎక్కువ రోజులు వుండలేదు. ఆ వాతావరణం, వారి జీవన శైలి తనను ఉక్కిరి బిక్కిరి చేస్తూ... గెజిటెడ్ అధికారిగా జీవితాన్ని ప్రారంభించి, రిటైరయ్యేనాటికి జిల్లా స్థాయి అధికారిగా పదవి స్వీకరించాడు. ఎవరికీ తలొంచకుండా బతికాడు... ఇప్పుడూ అంతే...

తనకిపుడు ఏ బరువూ, బాధ్యతలూ లేవు. మానసికంగా, ఆరోగ్యంగా వున్నప్పుడే ఈ జీవితాన్నుంచి గౌరవప్రదంగా తప్పుకోవాలి. మంచం మీద దీర్ఘకాలం రోగంతో తీసుకునో, కొడుకుల నిరాదరణకు గురయ్యో తను వృద్ధాప్యం నించి మరణంలోకి ప్రయాణించడం ఇష్టం లేదు.

'అంటే తను స్వచ్ఛందంగా మృత్యువుని ఆహ్వానిస్తున్నాడా?!' సుందరయ్య గుండె జల్లుమంది.

వారం రోజుల క్రితం పేపర్లో పడిన వార్తకా తనకీ స్పందన?! ఆ పేపర్లో ఏం రాసారు? కేరళలో ఒకాయన స్వచ్ఛంద మృత్యువైద్యాలయాలు ఏర్పాటు చెయ్యాలంటాడు. అది ఆత్మహత్య క్రిందకు రాదట. ఇండియన్ పీనల్‌కోడ్ 306, 309 సెక్షన్ల క్రింద మరణం క్రిందే లెక్కట, ఆయన్ని కలిస్తే బాగుండును. తన ఆలోచనకే తనలో భయం కలిగింది సుందరయ్యకు.

ఇక ఆ సమావేశంలో వుండాలనిపించలేదు. ఆ గదిదాటి బైటకొచ్చాడు. నడుస్తున్నాడు. వాహనాలరొద. మనుషులు గబగబా వెళుతున్నారు. అందరి గమ్యం ఎక్కడికో? మనుషులందరూ చావడానికే పుడుతున్నట్టు ఎందుకీ పరుగు?

సుందరయ్యకు నిర్లిప్తత నిరాసక్తత తన వయసువాళ్లంతా ఒక్కొక్కరే పోతున్నారు వారం రోజుల క్రితం, నాయుడు నిద్దట్లోనే దీర్ఘనిద్రకు లోనయ్యాడు. అతగాడికి తెలీదు అతను పోతున్నట్టు, నిద్రపోయేముందు తనతో కబుర్లాడాడు. ఇద్దరూ కల్సి సుష్టుగా భోంచేశారు. తనను బస్టాప్ వరకు సాగనంపేడు. ఇద్దరూ కలిసి మిఠాయికిళ్ళీ బిగించేరు. ఇంటికి రాగానే గుర్రు పెట్టి నిద్రపోయాడట. తెల్లరేసరికి మనిషి ఈ లోకంలో లేడు. గొప్ప అదృష్టవంతుడు. నాయుడంటే అసూయ కలిగింది సుందరయ్యకు.

తనకిపుడు డెబ్బైయేళ్ళు దాటాయి. భారత దేశపు ప్రధానికి ఉండే వయసు. అయినా చావుగురించి దిగులెందుకు అంటారు. అయినా ఏమిటో ఈ వైమనస్యం?! ఇంటి ముఖం పట్టేవరకూ సుందరయ్య ఆలోచనలు అలా సాగుతూనే వున్నాయి.

* * * * *

ఉదయం ఐదయింది. "కౌసల్యా సుప్రజారామా.." సుబ్బులక్ష్మిగారి గానం లీలగా చెవుల్ని తాకేసరికి లేచి కూర్చున్నాడు. సుందరయ్య. ముఖం కడిగి ఇంటికి

తాళం వేసి బైటకొచ్చాడు రోజూ ఒక గంట ఉదయం పూట ఈ ప్రాతఃకాలపు నడకతో కాలక్షేపం అయిపోతుంది. అప్పుడే పాలపాకెట్టు కొనుక్కొచ్చేస్తాడు. తన వీధి మొదట్లో మిగతా మార్నింగ్‌వాక్ మిత్రులు కలుస్తారు. మొత్తం ఆరుగురు తనతో.

నలుగురు ఎదురయ్యారు.

'రామారావు, వెంకటపతి, ముకుందం, శాస్త్రి, రాజారావు లేడేమిటి?' అనుకున్నాడు

అందరూ మౌనంగా నడుస్తున్నారు. సుందరయ్య వెంటనే అన్నాడు "రాజారావు రాలేదా" అని.

సుందరయ్య ప్రశ్నకు ఎవరూ సమాధానం చెప్పలేదు. వెంకటపతి చేతిలో ఏదో పుస్తకం.

"ఏమిటయ్యా పుస్తకాల పురుగు, ఇంత పొద్దున్నే పట్టుకు తిరుగుతున్నావ్" అన్నాడు

"ఇది రావూరి భరద్వాజ గారి ఐతరేయం" అన్నాడు వెంకటపతి.

వెంకటపతి చెప్పుకుపోతున్నాడు. ఆ పుస్తకం గురించి ఆ సంగతులు విని, "ఆయన కవి, రచయిత, వేదాంతి అందుకే తన అంతర్మధనాన్ని అలా కావ్య కథనంలా మలిచాడు. మరి తను? మూగగా రోదించింది సుందరయ్య మనసు. దాన్ని తేలిక పరుస్తూ మనసును మళ్ళించడానికి, సుందరయ్య మళ్ళీ అడిగేడు. "రాజారావు గురించి ఎవరూ నోరు విప్పరేం ఒంట్లో బాగాలేదా?"

శాస్త్రి అన్నాడు "నీకు ఎందుకు చెప్పడం అనుకున్నాం, ఎందుకంటే నీకు అసలే శ్మశాన వైరాగ్యం ఎక్కువ. ఐచ్ఛిక మరణం అంటూ ఏదో మాట్లాడతావ్, తీవ్రంగా ఆలోచిస్తావ్... ఏమయిందంటే నిన్న రాత్రి రాజారావు పోయాడట, బాగా తాగేడట, తాగి చనిపోయాడని కొడుకు అంటున్నాడు గానీ, వాస్తవానికి..."

సుందరయ్య షాక్ తిన్నాడు. అతడూహించని జవాబు అది.

"ఏమిటి సందేహంగా చెపుతున్నావ్?" అన్నాడు సుందరయ్య ఆదుర్దాగా.

నీకు తెలుసుకదా మన వాకింగ్ మిత్రుల్లో అందరికన్నా చిన్నవాడు రాజారావు. యాభైతొమ్మిదేళ్ళు. రైల్వే ఉద్యోగి ఇంకో సంవత్సరంలో పదవీ విరమణ చేస్తాడు. భార్య లేదు. ఉన్న ఒక్క కొడుకూ రికామిగా తిరుగుతాడు. ఉద్యోగం లేదు "అవును, అయితే?" శాస్త్రి మాటలకు అడ్డొస్తూ అన్నాడు సుందరయ్య.

"నిన్న రాత్రి కొడుకు తండ్రి చేత బాగా తాగించేడట. ఆ తరవాత తలగడ ముక్కుమీద పెట్టి, చంపేసాడు. సహజ మరణంగా చిత్రీకరించేడట?" సుందరయ్య ఆ మాటలు మరి వినలేక పోయాడు.

"దేనికి చంపినట్లు?"

"తండ్రి ఉద్యోగం తనకొస్తుందని!"

"మైగాడ్ ఏమిటీ వైపరీత్యం" తల పట్టుకున్నాడు సుందరయ్య. కొన్ని క్షణాలసేపు ఆ ముగ్గురి మధ్యా నిశ్శబ్దం. వారి మౌనాన్ని భగ్నం చేస్తూ సుందరయ్య అన్నాడు.

"వెళ్ళి రాజారావుని చూసొద్దాం. ఆఖరి చూపులు కదా..."

"ఒద్దొద్దు, వాళ్ళింటి దగ్గర చాలా గొడవగా ఉంది. శవాన్ని దహనం చేసేందుకు కొడుకు ఏర్పాట్లు చేస్తుంటే రాజారావు తమ్ముళ్ళు మాత్రం పోలీసులొచ్చే వరకూ శవం కదలకూడదంటున్నారు."

"అయ్యో" అనుకున్నాడు సుందరయ్య.

రాజారావు తెల్లగా, బొద్దుగా వుంటాడు. తను అతడిని తమ్ముడూ అనేవాడు రాజారావును పరపరా కోసేస్తారు కాబోలు. పేగులు తీసి, కాలేయం గుండె పరీక్ష చేస్తారు.

"ఆ తర్వాత? బాధగా నిట్టూర్చాడు సుందరయ్య. తమ గమ్య స్థానం వరకూ నడిచి వెను తిరిగే వరకూ ఎవ్వరూ మాట్లాడుకోలేదు.

చివరికి సుందరయ్య అన్నాడు వారి దగ్గరినించి శలవుపుచ్చుకుంటూ, "నేను నెల రోజుల తర్వాత కనిపిస్తాను మామనవరాలి పెళ్ళి హైదరాబాదు వెళ్ళుతున్నాను."

.... అలా అంటూ సుందరయ్య ముందుకు నడిచాడు.

* * * * *

వెంకటపతి బుక్ ఫెస్టివల్ ఆవరణలోకి ప్రవేశించాడు. అతడికి ఎక్కడలేని ఆనందం వచ్చేసింది.

విశాఖలో బుక్ ఫెస్టివల్ అని నెలక్రితం తెలిసింది అప్పటినుంచి కళ్లు కాయలుకాసేలా ఎదురుచూస్తున్నాడు.

ఆనందం, ఆశ్చర్యం, రెండు కలబోసిన భావంతో పుస్తక విభాగాల్లోకి అడుగు పెట్టాడు.

ఒక్కో విభాగం చూస్తుంటే ఒళ్ళు పులకరిస్తోంది. 'గురజాడ వారి కన్యాశు ల్కం" తన దగ్గరున్నది పాత ఎడిషన్, ఆ క్రొత్త ఎడిషన్లలో పేజీలు తిరగేసే సరికి తను పుట్టి పెరిగిన విజయనగరం, కళ్ళముందు సాక్షత్కరించింది. కొంచెం ముందుకు నడిచాడు. పిక్ విక్ పేపర్స్, హకవ్‌బెరీఫిన్, టాల్‌స్టాయ్....' హాయిగా నవ్వుకున్నాడు, ఆ పుస్తకాలు చూసి. ఆ పుస్తకాల ప్రక్కనే శ్రీశ్రీ ... ఆ తర్వాత రాజుమహిషి, ఇల్లు, అలా రావిశాస్త్రీయంలోకి ప్రయాణం చేసి. ఆ తర్వాత జాషువా గబ్బిలం పిరదెశి కావ్యాలను స్పృశించి 'కారా' మాష్టారి కథల దగ్గర ఆగిపోయాడు.

ఒక్కక్షణం ఆలోచనలో పడ్డాడు. వెంకటపతి కారామాష్టారు గుర్తుకు రాగానే వెంకటపతి కళ్లల్లో కథానిలయం మెదిలింది. తన లైబ్రరీలోని కొన్ని పుస్తకాలు కథానిలయానికి అందచెయ్యాలని తన లైబ్రరీ గుర్తుకురాగానే సంతోషంతో వెంకటపతి

హృదయం ఎగిసిపడింది. ఆ లైబ్రరీ తన పాతికేళ్ళ కష్టార్జితం. తనకున్న ఏకైక వ్యసనం పుస్తకాలు. అవిపుడు రెండువేలపైనే.. వాటన్నిటికీ భార్యే అట్టలు వేసి బైండు చేసింది. పుస్తకాలు సర్దుతూ, వాటికి చెదపట్టకుండా చూసేది. తను ఇప్పుడులేదు, తనకు పుస్తకాలు సర్దే ఓపికలేదు. వాటిని పురుగులు తింటున్నాయి. ఇల్లంతా పాడవుతోంది అని కొడుకు, కోడలు ఒకటే గోల... గోలకాదు వారి అసలు బాధేమిటి?

వెంకటపతి నిస్పృహగా కూలబడ్డాడు. ఆ పుస్తక విభాగంలో నేలమీద.

తన ఇల్లుపైన ఒక పోర్షన్ కట్టించాడు. దాంట్లో ఒక గదిని ప్రత్యేకంగా లైబ్రరీగా మార్చుకున్నాడు. దాని నిండా పుస్తకాలే. ఆ గది కిటికీ లోంచి చూస్తే ఆకాశం కనిపిస్తుంది. తను ఆ కిటికీ ప్రక్కనే కూర్చీవేసుకుని చదువుకుంటూ వుంటాడు. రిటైరైన పదేళ్ల నించీ తనకదే కాలక్షేపం. ఇప్పుడు కొడుకు తనని అడుగుతోన్నదేమిటి? ఆ పుస్తకాలు అమ్మేసి ఆ పోర్షను అద్దెకిస్తే వెయ్యి రూపాయలు అద్దె వస్తుంది కదా అంటాడు. అపుడ తనేమన్నాడు? "నేను చచ్చిన తర్వాత నా మీద వేసి తగలబెట్టండి. అంత వరకూ నా పుస్తకాల్ని ఏమైనా చేస్తే జాగ్రత్త?" అనేసాడు కోపంగా..

ఆ విషయం గుర్తుకొచ్చి బాధకు లోనయ్యాడు వెంకటపతి. అంతలోనే పుస్తక విభాగాల్లోకి తలదూర్చి మామూలు మనిషయ్యాడు. పుస్తకాలన్నీ రెండేసి సార్లు చూసి నచ్చిన నాలుగు పుస్తకాలు కొని విడవలేక విడిచిపెట్టాడు, వెంకటపతి ఆ బుక్ ఫెస్టివల్‌ని.

నడుస్తూ బస్టాపు వరకు వచ్చి బస్సెక్కాడు వెంకటపతి. తను కొన్న పుస్తకాల్లోకి తలదూర్చాడు. స్టేజి వచ్చే వరకూ పుస్తకాల్లోనే మునిగిపోయాడు. కాలనీ రాగానే బస్సు దిగి ఇంటివైపు అడుగులు వేస్తున్నాడు. దారిలో సెకండ్ హేండ్ పుస్తకాల దుకాణం. మనసు మళ్ళీ పుస్తకాల వైపు పీకింది రోడ్డుపక్క ఫుట్‌పాత్ మీద పరిచిన ఆపుస్తకాలు తిరగేస్తున్నాడు ఒక పుస్తకం చూసి ఆగిపోయాడు. అది బుచ్చిబాబు అరుకులోయలో కూలిన శిఖరం ఆ పుస్తకం మొదటి పేజీలో వెంకటపతి 11-1-82

అని రాసుంది.

'ఇది నా పుస్తకం, ఈ దుకాణంలోకి ఎలా వచ్చింది?' అనుకున్నాడు. అతని గుండె దడ దడ లాడింది. ఆ పుస్తకాల షాపతనిని అడిగాడు, "బాబూ ఈ పుస్తకం ఎవరమ్మారు? "మా" కుర్రాడు పొద్దున్నే ఎవరింట్లోనో కొనుక్కొచ్చాడు. చాలా పుస్తకాలు రెండు వేలకు పైగా."

ఆ మాటలకు ఒక్కసారి తనను గోతిలో పోసి చుట్టూ మంట పెట్టినట్టుగా అనిపించింది వెంకటపతికి. కళ్ళలో నీళ్ళు.. జల జల మంటూ రాలాయి, ఆ పుస్తకం వదిలి రావడం ఇష్టంలేకపోయింది. ఆ పుస్తకం కొని గబ గబా నడుస్తున్నాడు. గుండెల్లో ఏదో బాధ సుళ్ళు తిరుగుతోంది. జేబులోవున్న టాబ్లెట్లు తీసి నాలిక ముందుంచాడు. నొప్పి తగ్గినట్టనిపించింది. నడవలేక రిక్షా ఎక్కాడు.

ఇల్లు రాగానే రిక్షా దిగి లోపలికి వస్తుంటే గేటుకు తగిలించిన టులెట్ బోర్డు చూసి అతడి చెయ్యి బిగుసుకుంది. కోపంగా మెట్లెక్కాడు వెంకటపతి. కోడలు వచ్చి "కాఫీ తాగి వెళుదురుగాని", అని అంటున్నా వినకుండా పైకి నడిచాడు. పుస్తకాలుంచిన గది బోసిగా వుంది. అలమారులన్నీ ఖాళీగా వున్నాయి. పుస్తకాలు లేని గది శ్మశానంలా అనిపించింది వెంకటపతికి, కళ్ళ నించి అవిరామంగా కన్నీళ్ళు శూన్యంగా ఉన్న ఆ గదిలో నేలమీద భారంగా పడుకున్నాడు వెంకటపతి.

పావుగంట తర్వాత మనవరాలు కాఫీ తీసుకొచ్చింది. "తాతయ్యా" అని పిలిచినా అతను పలకలేదు.

మనవరాలు క్రిందకి వెళ్ళి "తాతయ్య మాట్లాడటం లేదు" అంది.

కోడలు నవ్వుతూ, "పుస్తకాలు అమ్మేసామని అలిగినట్టున్నారు. ఇల్లంతా చెదలు పట్టేస్తోంటే అంతకన్నా ఏం చెయ్యగలం నాన్న రానీ, ఏదో సర్దిచెపుతారు" అంది.

గంట తర్వాత వచ్చాడు వెంకటపతి కొడుకు, అప్పటికీ పడుకునే వున్న తండ్రిని చూసి చేత్తో లేపాడు.

వెంకటపతి శరీరం చల్లగా తగిలింది. అతడి గుండెలమీంచీ జారిపడింది బుచ్చిబాబు 'అరకులోయలో కూలిన శిఖరం'.

* * * * *

సుందరయ్య బద్ధకంగా లేచాడు. కిటికీలోంచి వెలుతురు ముఖం మీద పడుతున్నా కళ్ళు తెరవలేకపోతున్నాడు. రాత్రి తనొచ్చిన ట్రైన్ ఆలస్యంగా వచ్చింది నిద్రసరిపోలేదు. గోడగడియారం వంక చూసాడు టైము ఎనిమిది.

అయ్యో, పాలపాకెట్లు అయిపోతాయేమో. అనుకుంటూ గబ గబా తయారయ్యాడు.

రోడ్డు మీద కొచ్చాడు. ఒకసారి నిస్పృహ ఆవరించింది తను హైదరాబాదులో వుండగానే వెంకటపతి విషయం తెలిసింది. అతడి జ్ఞాపకాలు గుర్తు చేసుకునేంతలో వైజాకు చేరగానే రైల్వే స్టేషనులోనే మరో దుర్వార్త... రామారావు కోమాలోకి వెళ్ళి పోయాడు. అతనింటికి వెళితే వివరాలు తెలుస్తాయి. మద్రాసు తీసుకెళ్ళారంటున్నారు? ఏమయిందో అనుకుంటూ దారిలోనే హోటల్‌లో కాఫీ తాగి రామారావు ఇంటికి నడవడం ప్రారంభించాడు.

రామారావు చాలా కష్టపడి పైకొచ్చాడు. రామాగ్రూప్ ఆఫ్ కంపెనీస్‌కు అధిపతి తన కొడుక్కి వ్యాపారాలు అప్పగించి తను విశ్రాంతి తీసుకుంటున్నాడు. కొడుకేమో ఆ వ్యాపారాలతో పాటు కాంట్రాక్టులు చేయడం ప్రారంభించాడు. అది రామారావుకి ఇష్టంలేదు. తండ్రి కొడుకుల మధ్య అదే విషయం మీద వైరుధ్యం....! ఆ విషయాలు రామారావు తనతో చెప్పడం గుర్తుకొచ్చింది సుందరయ్యకు.

రామారావు పీలగా సన్నగా వుంటాడు. ఇప్పుడు గొట్టంద్వారా, పాలు ఆహారం పంపిస్తున్నారట... పాపం ఎన్ని పెద్ద సంస్థలకు ఛైర్మన్ అయితే ఏం, గుప్పెడు మెతుకులు తినే వీలులేకుండా పోయింది. సుందరయ్యలో పరిపరివిధాల ఆలోచనలు.

రామారావు ఇల్లు కనిపించే సరికి గుండెల్లో గుబులు ఎక్కువయింది

సుందరయ్యకు. అదొక పెద్ద బంగళా, చుట్టూ ప్రహరీగోడ, బైట పెద్ద గేటు.

లోపలికి వెళ్ళబోయేంతలో సింహం లాంటి కుక్క మీద కొచ్చింది. "సీజర్ ఆగు" అంటూ పనబ్బాయి వచ్చి సుందరయ్య వంక ప్రశ్నార్థకంగా చూసాడు.

నేను రామారావు గారి మిత్రుణ్ణి, ఆయన్ని తీసుకొచ్చేసారా మద్రాసునించి" అడిగాడు సుందరయ్య.

"లేదయ్యా, అబ్బాయిగారున్నారు రండి" అంటూ సుందరయ్యను ఇంటి లోపలికి తీసుకెళ్ళి కూర్చోపెట్టాడు.

ఆ గది చాలా చల్లగా అనిపించింది సుందరయ్యకు ఖరీదైన కార్పెట్ మహారాజసోఫాలు, టీపాయి మీద నాలుగు పేపర్లు. ఒక పేపరు తీసి చదవడం ప్రారంభించాడు. ఇంతలో కాఫీ తీసుకొచ్చి ఇచ్చింది ఒకమ్మాయి.

పావుగంట తర్వాత రామారావు కొడుకొచ్చాడు పొడుగ్గా లావుగా డైచేసినట్టుగా నల్లజుట్టు, గోల్డ్‌ఫ్రేమ్ కళ్ళద్దాలు, ఒక చేతికి బ్రాస్‌లెట్, మరో చేతికి బంగారు కడియం.

రామారావు కొడుకు కూర్చుని సెల్ ఫోన్‌లో ఎవరితో మాట్లాడుతున్నాడు రెండునిమిషాల తర్వాత "షిట్!" అంటూ ఫోన్ పెట్టేసాడు.

సుందరయ్యకు అడిగే అవకాశం ఇవ్వకుండానే "నాన్నగారు కోమాలోకి వెళ్ళారు, ఇక లాభం లేదంటున్నారు. కోమాలోంచి బైటకు రారు... ఏదీ తేలదు. అవతల నాకు బోలెడు పనులు, కోటిరూపాయల కాంట్రాక్టు, టెండరు వెయ్యాలి, నా సెక్రటరీని మద్రాసులో వుంచాను అమ్మకు తోడుగా..." చెప్పుకు పోతున్నాడు.

సుందరయ్యకు అసహనంగా వుంది ఆమాటలు వినడానికి, తండ్రి చావు బతుకుల్లో వుంటె తనవ్యాపారంగురించి ఆలోచిస్తున్నాడా... ఇదేమిటి విచిత్రం అనుకున్నాడు.

అన్ని ఏర్పాట్లు చేసేసాను. నాకు తెలిసి ఫారెస్టు ఆఫీసరు గంధపు చెక్కలు పంపించాడు. నెయ్యి డబ్బాలొచ్చాయి. అన్ని ఏర్పాట్లు జరిగాయి. బంధువులంతా వచ్చి కూర్చున్నారు... ప్చ్...ఏది తేలదు..."

అతని మాటల అంతరార్థం అవగతమై ఇక అక్కడ కూర్చోలేక రామారావుగారిని తీసుకొచ్చిన తర్వాత వస్తాను అంటూ గబ గబా నడిచాడు, ఆ ఇంట్లోంచి బైటకు సుందరయ్య.

* * * * *

సుందరయ్య తరువాతిరోజు ఉదయం మార్నింగ్ వాక్‌కు బయలుదేరాడు. తాను తనమిత్రులతో కలిసేచోటు దగ్గర నిలుచున్నాడు. ఎవరూ లేరు. నిట్టూర్పు విడుస్తూ ముందుకు నడుస్తున్నాడు. కొంతదూరం నడిచేసరికి శాస్త్రి కలిసాడు.

సుందరయ్య నవ్వేడు శాస్త్రిని చూసి. ఆ నవ్వుతో శృతి కలిపేడు శాస్త్రి. కానీ ఆ నవ్వులో జీవము వున్నట్టు కనబడలేదు సుందరయ్యకు.

"ఏమిటి విశేషాలు?..." అన్నాడు సుందరయ్య శాస్త్రి మాట్లాడలేదు.

"ఏమిటీ మాట్లాడవ్" అన్నాడు సుందరయ్య. దానికి నవ్వి కాగితం మీద ఏదో రాసి అందించాడు శాస్త్రి.

"జ్ఞానకచేరీ చేస్తున్నా... అందుకే ఈ మౌనం" అన్నాడు.

సుందరయ్యకు అర్థం కాలేదు. పజిలింగ్ అనిపించింది.

"జ్ఞానకచేరీ అంటే మౌనయోగమా?" అన్నాడు సుందరయ్య. దానికీ నోరిప్పలేదు శాస్త్రి. మరీ తరచి అడిగితే బావుండదని తనూ మౌనంగా అడుగులేస్తున్నాడు శాస్త్రి గురించి ఆలోచిస్తూ.

శాస్త్రి తన బాల్య స్నేహితుడు. ఇద్దరూ చిన్నప్పటినించీ కలిసే చదువుకున్నారు.

తను ఉద్యోగరీత్యా చాలా ప్రదేశాలు తిరిగాడు. శాస్త్రి మాత్రం అదే ఊళ్ళో లెక్చరర్‌గా జాయినయ్యి అదే కాలేజీలో రిటైరయ్యాడు.

శాస్త్రికి ఇద్దరు మగపిల్లలు ఇద్దరు ఆడపిల్లలు. అందరికీ పెళ్ళిళ్ళయిపోయాయి. శాస్త్రి పనిచేసే కాలేజీలోనే కొడుకులకు లెక్చరర్ ఉద్యోగాలు వచ్చాయి. అదే కాలేజీలో పనిచేసే అమ్మాయిలనే కోడళ్ళుగా చేసుకున్నాడు.

శాస్త్రికి వారసత్వంగా వచ్చే రెండతస్తుల భవనం వుంది. అంతా కలిసే వుంటారు. అందరి జీతాలు శాస్త్రికి ఇస్తారు. ఎవరికి అవసరం వచ్చినా శాస్త్రిని అడుగుతారు. కొడుకులు, కోడళ్ళు, మనవలు, ఇలా ఆ సమిష్టి కుటుంబం శాస్త్రి మూలంగా ఇంకా చెదరకుండా వుంది. తను పోయినా, అంతా కలిసే వుండాలని శాస్త్రి కోరిక.

శాస్త్రిని చూస్తే సుందరయ్యకు ఆశ్చర్యం. ఎప్పుడూ ఏ సమస్యతోనో సతమతమైనట్టూ కనబడడు. నిత్యం నవ్వులతో గుబాళిస్తూ వుంటాడు.

మరి ఈ రోజేమిటి? ఇలా? జ్ఞానకచేరి అంటూ ఏదో మాట్లాడుతున్నాడు! శాస్త్రిని చూస్తూ అనుకొంటున్నాడు సుందరయ్య.

ఆ అరగంటసేపు ఇద్దరూ చెరోదారి విడిపోయేవరకు అదే మౌనవ్రతం పాటించేడు శాస్త్రి. సుందరయ్యకు విసుగెత్తి ఊరుకొన్నాడు.

ఇంటివైపు వెళ్ళే సందు తిరిగేసరికి సార్! అంటూ ఎదురుపడ్డాడు ఒక కుర్రాడు. పొడుగ్గా సన్నగా. ఎప్పుడో చూసిన ముఖం. "నేను ముకుందం గారి అబ్బాయిని" అన్నాడు కుర్రాడు.

అప్పుడు గుర్తుకొచ్చింది సుందరయ్యకు.

"మీ కోసం ఇంటికెళ్ళాను, తాళం వేసుంది. పక్కింటి వారిని అడిగితే మార్నింగ్ వాక్‌కి వెళ్ళారని చెప్పారు అన్నాడా" కుర్రాడు పరీక్షగా చూస్తున్న సుందరయ్యతో.

"నాతో ఏమైనా పనుందా? "అన్నాడు సుందరయ్య" ఔనండీ! మా నాన్న రెండు రోజుల్నించీ కనిపించడం లేదు. మీ కేమయినా కలిసాడా, ఎక్కడికైనా వెళుతున్నాని చెప్పాడా? ఆ కుర్రాడు ఆదుర్దాగా అడుగుతూంటే ఆశ్చర్యంగా అతణ్ణి చూస్తూ వుండిపోయాడు సుందరయ్య.

క్షణం తర్వాత తేరుకుని సుందరయ్య అన్నాడు. "ఇంట్లో ఏమైనా గొడవపడ్డాడా?"

"రోజూ గొడవే ఆయనతో, అన్ని పదార్ధాలు వేడిగా వుండాలి. ఉదయం లేచిన దగ్గర్నుంచీ పోయ్యికాలుతూ వుంటుంది దాని గురించే అన్నయ్య నాన్నను అరిచేడు, పదిహేను రోజుల క్రితం. అంతే, కోపగించి వెళ్ళిపోయాడు సామాను సర్దుకొని..."

"నాకు ఈ మధ్య ఎప్పుడో ఒకరోజు హొటల్‌లో భోజనం చేస్తూ కనిపించాడే..." అన్నాడు సుందరయ్య.

"ఔనండీ, అన్నయ్య తిట్టిన రోజునించీ వెళ్ళిపోయి, వేరే రూము తీసుకొని ఉంటున్నాడు. ఎవరు చెప్పినా రాలేదు. రెండు రోజుల క్రితం వెళ్ళి చూస్తే రూము ఖాళీ చేసి వెళ్ళిపోయాడు. మా అక్కయ్యకు ఉత్తరం రాసాడు నా గురించి వెతకొద్దు ఇంకెప్పుడూ కనిపించనూ అని."

"అయ్యో..." ఎక్కడకు వెళ్ళివుంటాడో ఈ వయసులో... సుందరయ్య బాధపడుతూ అన్నాడు.

"అదే అర్థం కావడంలేదు... ఆయనకు డయాబిటీసు, బ్లడ్ ప్రెషరూ రెండూ వున్నాయి..." ముకుందం కొడుకు దిగులుగా అన్నాడు.

"కంగారు పడకండి, వెళ్ళినవాడు తనే తిరిగొస్తాడు... నాకేమయినా సమాచారం తెలిస్తే చెపుతాను..." ఆ కుర్రాడికి ధైర్యం చెప్పి పంపినా సుందరయ్య

మనసు మనసులో లేదు. ముకుందం కొంచెం కోపిష్టి. అతనికి తగ్గవాడే కొడుకు, ఆ తండ్రి లక్షణాలు ఎక్కడికిపోతాయ్? రిటైరైన మనిషి కొడుకింట్లో వుంటున్నాడు. భార్యలేదు. తనకు కావలసిన రీతిలో అన్నీ కావాలంటే ఎలా? ఏదో సర్దుకు పోవాలిగానీ... ఇంటికి వెళ్ళేవరకూ ముకుందం గురించే ఆలోచిస్తున్నాడు సుందరయ్య.

* * * * *

చీకటి తెరలు, ఎవరో మోస్తున్నట్టున్నారు. తననెక్కడికి తీసుకెళ్ళుతున్నారు? సుందరయ్య కళ్ళు తెరువలేక పోతున్నాడు. గుండె శబ్దం వినిపిస్తోంది. నాడి కొట్టుకుంటోంది. తనుచావలేదు. అయినా తనెందుకు పాడెమీదున్నాడు. దాన్ని మోసే నలుగురూ... వాళ్ళ ముఖాలెక్కడో చూసినట్టు చిత్రంగా వాళ్ళలో తన నలుగురు కొడుకుల పోలికలూ కనిపించాయి. తన ముందు ముకుందం... అతని పక్కనే రామారావు... శాస్త్రి.. తనతో పాటు అందరూ ఏడుస్తున్నారు. మూలుగుతున్నారు. చీకట్లో ఎక్కడికో ప్రయాణం... ఊరు దాటేరు. నక్కల ఊళలు వినిపిస్తున్నాయి. నక్షత్రాలు జాలిగా చూస్తున్నాయి. ఆకాశంలో మబ్బులు దెయ్యాల్లా కదులుతున్నాయి. ప్రయణం ఒక కొండచరియ దగ్గర ఆగిపోయింది. అక్కణ్ణించి తోసేరు... ఒద్దు.. మేమింకా చావలేదు... మా బ్రతుకేదో మేం బ్రతుకుతాం... తాము ఏడుస్తూ అరిచేరు.. ఆ ఆక్రందనలతో ఆ ప్రదేశం దద్దరిల్లుతోంది... లేదు వయసు మళ్ళిన వృద్ధులారా చావండి.

అయ్యో వద్దు వద్దు బ్రతికుండగానే చంపొద్దు.

సుందరయ్య గబుక్కున లేచి కూర్చున్నాడు.

గదిలో లైటు వెలుగుతోంది. టీవిలో ఏదో ఇంగ్లీషు సినిమా, అంటే తను రాత్రి టీవీ ఆపకుండానే అలాగే నిద్రపోయాడా?

పొద్దెక్కిందనేందుకు నిదర్శనంగా గదంతా వెలుగు పరుచుకుంది. కిటికీ తెరిచాడు. అద్దెకుంటున్నవారి అమ్మాయి పూలుకోస్తోంది. పేపరువాడు ఆ రోజు

దినపత్రిక గుమ్మం ముందుంచి వెళ్ళిపోయాడు.

తన కొచ్చిన కల గురించి ఆలోచిస్తున్నాడు సుందరయ్య తను రాత్రి ఏదో సినిమా చూస్తూ నిద్రపోయాడు. అప్పుడు గుర్తొచ్చింది సుందరయ్యకు తను రాత్రి చూసింది అకిరకురసోవా అనే జపాన్ డైరెక్టరు తీసిన అద్భుతమూన సినిమా దాంట్లో ఏం జరిగింది? చావకుండానే వయసు మళ్ళిన వృద్ధుల్ని బహిరంగ సజీవ శ్మశానంలోకి పడవేస్తారు. వారంతా నరకయాతన అనుభవించి చనిపోతారు.. ఆ సినిమా తన కలలో కొచ్చింది ఎందుకొచ్చినట్టు? ఆలోచిస్తూ తలుపుతీసి బైటకొచ్చాడు సుందరయ్య.

గుమ్మం ముందున్న పేపరు తీసాడు. గదిలో కూర్చుని పేజీలు తిప్పుతున్నాడు. జిల్లా అనుబంధంలో మొదటి పేజీలో ఫోటో చూసి గుండెలు జల్లుమన్నాయి. గబ గబా చదివాడు.

మా నాన్నగారైన పిన్నమనేని సీతారామరావు, ఛైర్మన్, రామాగ్రూప్ ఆఫ్ కంపెనీస్, విశాఖపట్నం, దీర్ఘకాలిక కోమాలోనించి బయటపడి మృత్యుంజయులై తిరిగివచ్చేరని తెలియ చేయడానికి సంతోషిస్తున్నాము. ఈ కష్ట కాలంలో మాకు అండగా నిలిచిన హితులకు, ఆత్మీయులకు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు. పిన్నమనేని సతీష్‌బాబు, కాంట్రాక్టర్ మరియు ఎమ్.డి. రామాగ్రూప్ ఆఫ్ కంపెనీస్.

ఆ ప్రకటన చదివి హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు సుందరయ్య వెంటనే రామారావును చూడాలనిపించింది. కాల కృత్యాలు పూర్తి చేసి పావుగంటలో రామారావు భవంతి ముందున్నాడు. నౌకరు సుందరయ్యను లోపలిగదిలోకి తీసుకెళ్లాడు. ఆ గదిలో దృశ్యం చూసి స్థాణువై నిలుచుండిపోయాడు సుందరయ్య.

డెభై ఏళ్ళుదాటిన రామారావు గదిలో పాకుతున్నాడు నోట్లో వేళ్ళుంచుకొని అతడి ఎదురుగా భార్య. "అమ్మా ఎవరో వచ్చారు చూడు" అంటున్నాడు మోకాళ్ళ మీదనించి లేవకుండానే.

ఇదేమిటీ పరిస్థితీ? వృద్ధాప్యంలోంచి బాల్యంలోకి ప్రయాణమా.. భార్యలోనే

తల్లిని చూస్తున్నాడా? సంభ్రమాశ్చర్యాలతో అలాగే నిలుచుండిపోయాడు సుందరయ్య.

సుందరయ్య ఇబ్బందిని గమనించి రామారావు భార్య రండి డ్రాయింగ్ రూములో కూర్చుందురుగాని," అంటూ అతడిని తీసుకెళ్ళింది.

సుందరయ్యకు ఏం మాట్లాడాలో తెలీక ఊరుకొన్నాడు.

"మనిషైతే దక్కారుగానీ... అన్నీ పిల్లవాడే చేష్టలే, నన్ను అమ్మా అంటారు. కోడల్ని వదిన అంటారు, ఇంటికొచ్చిన వాళ్ళను పలకరించే స్పృహలో లేరు. అన్నీ పంచెలోనే మా మనవడి బొమ్మలన్నీ ముందేసుకుని ఆడుకుంటున్నారు."

ఆ మాటలు చెపుతున్న ఆమె కంఠంలోని విషాదపు జీరను గమనించాడు. సుందరయ్య.

"మళ్ళీ ఆపరేషను చేస్తే మామూలవుతారట, కానీ ప్రాణానీకే ముప్పు అంటున్నారు. అందుకే మిగిలిన బ్రతుకంతా ఆయన పిల్లాడు నేను తల్లిని.." ఆమె ఆ మాటలు చెపుతూ గట్టిగా ఏడ్చేసింది. సుందరయ్య భారంగా కదిలేడు గేటువరకూ సాగనంపడానికొచ్చిన నౌకరు మెల్లగా అన్నాడు.

"బాబూ, పెద్దయ్యగారు అలా అయిపోవడానికి అబ్బాయిగారే కారణంబాబూ, కోమాలో వున్న ఆయన్ని ఆలా ఆస్పత్రిలో వదిలేసి తన కాంట్రాక్టు పనులు చూసుకున్నారు. ఆయన బ్రతికుండగానే కర్మకోసం ఏర్పాట్లు చేసారు. ఆ విషయం పెద్దయ్యగారికి తెలిసి అలా అయిపోయారంటండీ?"

"ఔనా! ఏమో? అలా జరిగేందుకు అవకాశం వుంది." అలా అంటూ సుందరయ్య గబగబా నడవడం ప్రారంభించాడు. ఆ ఇంట్లోంచి బయటపడి.

నడుస్తున్న సుందరయ్యలో ఒక్కసారి నైరాశ్యం ఆవరించింది. రామారావు చరిత్ర ఈ విధంగా ముగిసింది ఇక ముకుందం ఆమాకీ ఇంతవరకు అంతు చిక్కలేదు రాజారావుని కొడుకే చంపేసాడట? ఆ విషయం కొడుకు ఒప్పుకుని జైలు శిక్ష

అనుభవిస్తున్నాడు. మరి పుస్తకాల పురుగు వెంకటపతి కొడుకే కదా మానసికంగా హింసించి పరోక్షంగా అతడి చావుకు కారకుడయ్యాడు. అతడికి ఏ కోర్టు శిక్ష విధించగలదు? అయ్యో... వృద్ధాప్యం కొందరికి ఎంత చేదుగా... బాధగా ముగుస్తోంది? మరి జ్ఞానకచేరి అంటూ మౌనరాగం ఆలాపిస్తున్న శాస్త్రిమాటేమిటి? తను రెండు రోజుల క్రితం శాస్త్రిని తరిచి, తరిచి అడిగితే తెల్పినదేమిటి? శాస్త్రి తనకు ఏమి రాసిచ్చాడు? ఆ వాక్యాలు గుర్తుకొచ్చాయి. సుందరయ్యకు.

"ఇన్నేళ్ళుగా నేను బెదిరిపోకుండా కాపాడుకుంటూ వస్తున్న మా పొదరిల్లు కూలిపోవడానికి సిద్ధంగా వుంది. 'సమిష్టి కుటుంబాన్ని' ముష్టి కుటుంబంగా వెక్కిరిస్తున్నారు నా కొడుకులు. కోడళ్ళ సూటిపోటి మాటలతో మనసుచితికి పోతోంది. ఎవరికీ ఏమీ చెప్పలేను. అయినా వింటే కదా... కొడుకులకు రెక్కలొచ్చాయనుకున్నాను. కానీ వారికి కొమ్ములూ మొలిచాయి... అందుకే మౌనయాగం అనే జ్ఞానకచేరి చేసుకుంటూ బ్రతుకుతున్నాను. మన హృదయాన్ని పిండే వేదన చెప్పడం మొదలు పెట్టినప్పుడు ఆవతల వ్యక్తి వినకపోతే చెప్పి ఏమీ లాభం? అలాంటప్పుడు మౌనమే మన ఆయుధం మౌనం ఎంత శక్తినిస్తుందో.. మౌనం లోంచి ఆలోచనా తరంగాలు ఎగిసిపడి శాంతి తీరాన్ని తాకుతాయి. అందుకే నేను మౌనం అనే కచేరిలో పనిచేస్తున్నాను. అదే జ్ఞానాన్ని అందించే కచేరి... జ్ఞానాన్ని వెలికితీసే చోటు మౌనమే.. దీన్ని పలాయనం అంటే నాకేమిటి నష్టం... దీంట్లో ప్రశాంతత లభిస్తున్నప్పుడు..."

శాస్త్రి తనకు రాసిచ్చిన ఉత్తరంలోని వాక్యాలు గుర్తుకు తెచ్చుకొని మరింత కల్లోలానికి లోనయ్యాడు సుందరయ్య. ఆ అంతర్మథనం తోనే ఇంటిముఖం పట్టాడు.

* * * * *

తలుపు తాళం తీస్తున్న సుందరయ్యకు "తాతయ్యా మీకు ఉత్తర వచ్చింది." అంటూ పక్కపోర్షన్లో అద్దెకుంటున్న వారమ్మాయి తీసుకొని ఇచ్చింది. దస్తూరీ చూసి లోపలికి నడిచాడు పెద్దకొడుకు రాసిన ఉత్తరం అది చింపి చదివాడు.

"నాన్నా,

మీరు అక్కడ ఒక్కళ్ళే వుండడం ఏమీబాగోలేదు. మీకు హఠాత్తుగా ఏదైనా అయితే మేము హైదరాబాదునించి రావడం ఎంత ఇబ్బంది! సమయానికి శలవు దొరక్కపోయి ఆలశ్యం అయితే మీ సంగతి ఎవరు పట్టించుకుంటారు? అందుకే మీరుంటున్న పోర్షను అద్దెకిచ్చేసి వచ్చేయండి. ఇట్లు శంకరం..."

సుందరయ్య ఆ ఉత్తరం చదివి ఒక్కసారి కుర్చీలో కూలబడ్డాడు. తనకు ఆ మధ్య వచ్చిన కల నిజంకాబోతోందని భయపడ్డాడు. అంటే తన కొడుకులు తనను సాగనంపేందుకు రంగం సిద్ధం చేస్తారన్నమాట. తనిప్పుడేమిటి చెయ్యడం.. ఇది వరకూ చాలామంది కొడుకులు పయనించిన మార్గంలోనే వీళ్ళూనూ తనను పంచుకొంటున్నారు మూడేసినెల్లు.. అంతేకాదు తను వైజాగులో అర్ధాంతరంగా చస్తే వాళ్ళకు ఇబ్బందట. వాళ్ళకు అనువుగా అక్కడే పోవాలట? తను పుట్టి పెరిగిన ఈ నగరం వదిలి ఎలా పోగలడు? ఆలోచనల్లో చాలాసేపు సతమతమయాడు సుందరయ్య. ఆ బాధలో భార్య గురించిన జ్ఞాపకం మరింత కృంగదీసింది. ఆ రాత్రి నిద్రపట్టలేదు సుందరయ్యకు.

* * * * *

ఆరోజు ఉదయం ఇంకా ప్రొద్దుపొడవకముందే ఇంట్లోంచి బైటికొచ్చేడు. తలుపుకు తాళం వేసి ముందుకు నడిచేడు. రెండడుగులు వేసిన తర్వాత మళ్ళీ వెనక్కొచ్చి తాళంచెవి పక్క పోర్షనులో అద్దెకుంటున్న వారికిచ్చేడు. ఆ ఇంటి ఇల్లాలు ఆయన తాళం ఇవ్వడంతో అతణ్ణి విచిత్రంగా చూసింది. అసలెప్పుడూ సుందరయ్య అలా ప్రవర్తించలేదు. ఆమె ఏదో అడగబోయింది. సమాధానం చెప్పకుండా గబగబా నడుస్తున్నాడు. నిద్రలేకపోవటంలో కళ్ళు మంటలు పెడుతున్నాయి. దారిలో టీకొట్టు దగ్గర ఆగాడు. నీళ్ళతో కళ్ళు కడిగి కాసేపు టీకొట్టు దగ్గరున్న బెంచీమీద కూర్చున్నాడు. సుందరయ్య అడక్కుండానే గ్లాసులో టీపోసి అందించాడు. రెండు చుక్కలు చప్పరించి మిగతా టీ అలాగే వుంచి జేబులోని డబ్బులు టీషాపతనికి అందించి మళ్ళీ

నడుస్తున్నాడు. మనసులో దారపు పోగుల్లా చుట్టుకొన్న ఆలోచనలు అన్యమనస్కంగానే నడక సాగుతోంది. అప్పటికి సూర్యుడు పూర్తిగా ఉదయించి ప్రకాశవదనంతో మెరుస్తున్నాడు.

మహారాణి పేట దాటేడు. కింగ్‌జార్జి ఆసుపత్రి ముందు నిలుచున్నాడు. కాళ్ళు నొప్పులు పెట్టినట్టనిపించింది.

వెళ్లిపోతున్న ఆటోను పిలిచాడు సుందరయ్య, ఆటో అతనిపక్కగా ఆగింది. అప్రయత్నంగా ఎక్కేసాడు. "ఎక్కడికి బాబూ?" ఆటోడ్రైవరు ప్రశ్నకు సమాధానం చెప్పలేదు. సుందరయ్య. మళ్ళీ ప్రశ్నించేసరికి "ఆ... ఆ.. బీచ్‌కి" అన్నాడు తడబడుతూ ఇంతపొద్దున్నే బీచ్‌కి బయలుదేరుతున్నారేమిటి అనుకున్నాడేమో అతను నవ్వుకుంటూ ఆటోస్టార్ట్ చేసాడు.

ఇదు నిమిషాల్లో బీచ్ ఎదురుగా రోడ్‌మీద ఆటో ఆపేడు. ఆటో దిగి డబ్బులిచ్చి అడుగువేయసాగేడు సుందరయ్య.. కొంచెం దూరంలో ఆకాశం, సముద్రం కలిసిపోయినట్టు. బీచ్‌లో పలచగ ఉన్నారు జనం. మార్నింగ్ వాక్‌కి వచ్చినవాళ్ళు ఎవరో దూరంగా చేపలు పట్టే జాలరులు, ఇసుకలో నడుస్తున్నాడు. ప్రక్కనే "అయ్యా ధర్మం.." అనే శబ్దం వినిపించి తలతిప్పాడు. ఒక చెక్కబండిమీద ఒక ముసలి వ్యక్తి. వాడికి కాళ్ళు చేతులు లేవు, వాడిని తను చిన్నప్పటినించీ చూస్తున్నాడు. అంటే తన వయసేవుండొచ్చు.... తన అంగవైకల్యంతో తనవాళ్ళకు ఉపాధి కల్పించే వాడిని చూసినప్పుడల్లా తన జేబులో డబ్బులు అప్రయత్నంగానే బైటికొస్తాయి. అలా చేతికొచ్చిన డబ్బుల్ని వాడికి అందించాడు. తన బండితోసుకుని ముందుకెళ్ళాడు, కళ్ళతోనే కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆ ముష్టి మనిషి.

సుందరయ్య ముందుకు నడిచాడు. కాళ్లు నీటిలో తడుస్తున్నాయి. కెరటాలు ఫేంటును సగం వరకూ తడిపాయి మరికొంచెం ముందుకు నడిచాడు.

"అన్నీ వుంటాయి లతామంగేష్కర్ గానం, రవిశంకర్ సితారునాదం వెన్నెల

మబ్బులు.. మల్లెల గుబాళింపు.. ... పరవశింపజేసే ప్రకృతి. కానీ ప్రేక్షకుల్లో తన సీటు ఖాళీకానీ జీవితం దుఃఖం జీవితం జుగుప్స జీవితం స్వార్థం... జీవితం అమానుషం. జీవితం వ్యాపారం.. కొడుకులు తండ్రుల్ని చంపే రోజులు, మానసిక హింసకు భయపడి వృద్ధులు పలాయనం..'

సన్నగా, పల్చగా ముఖంమీద ఎర్రగా వెలిగే సింధూరంతో ఎదురుగా భార్య రెండు చేతులతో తనని పిలుస్తున్నట్టు. సుందరయ్య పూర్తిగా తడిపాడు. నీళ్ళు గుండెల వరకూ వచ్చాయి.

అప్పుడు.

దూరంగా సుందరయ్య అంతక్రితం డబ్బులు దానం చేసిన ఆ ముసలి అంగవికలుడు.. బ్రతుకుమీద ఆశచావనివాడు... అతణ్ణి చూసి సుందరయ్య మెదడులో ఏదో అలజడి వేయివోల్ట్ల విద్యుత్ విఘాతం కలిగించిన బాధ మునుగుతున్న సుందరయ్య చెయ్యి పైకి లేచింది. ఏదో హస్తం తనను లాగడం స్పృహ కోల్పోతున్న సుందరయ్యకు లీలగా గుర్తుంది.

పావుగంట తర్వాత కళ్ళు తెరిచిన సుందరయ్యకు తన చుట్టూ అంతా గుమిగూడి వుండడం కనిపించింది. తన ముఖంలోకి చూస్తూ ఒక పల్లెవాడు బాగాపండిన జుట్ట ముడుతలు తేలిన వంగని శరీరం. గోచీ బిగించి కట్టేడు.

"అయ్యా అకాళ్ళు చేతులు లేని ముస్టోడు అరిచాడు. ఎవరో మునిగిపోతున్నారే అని. అంతే గబ గబా పరిగెత్తుకొచ్చి ఈదుకొంటూ వచ్చిన ఒక్క సిటం (క్షణం) ఆలస్యం అయితే అమ్మో..."

ఆ పల్లె మనిషి మాటల వింటూ అలాగే కళ్ళుమూసుకుని పడుకున్నాడు సుందరయ్య.

కొద్ది సేపటికి భారంగా లేచాడు. ఆ ముసలి జాలరి రెండు చేతులు పట్టుకొని

వదిలాడు. తన ముఖం ఎవరికీ చూపించడం ఇష్టంలేక తలొంచుకుని నడుస్తున్నాడు బీచ్ దాటి రోడ్డెక్కాడు.

బండిమీది ఆ అంగవికలుణ్ణి ఎవరో ఆడమనిషి ఎత్తుకు తీసుకు వెళుతోంది. పొత్తిళ్ళలో పసికందును ఎత్తుకున్నట్టు. సుందరయ్య పెదాలపై చిరునవ్వు మెరిసింది ఉత్సాహంగా ముందుకు నడిచాడు. నడుస్తున్న అతన్ని ఎవరో ఆపారు. తలెత్తి పైకి చూసాడు. తెల్సిన మనిషి.

"ఎక్కడికి వెళుతున్నారు?" అడిగాడా వ్యక్తి.

క్షణం సేపు ఆలోచించి సుందరయ్య చెప్పాడు.

వైయుక్తికమైన బతుకులోంచి, ఇపుడు సార్వజనీనమైన జీవితంలోకి ప్రయాణిస్తున్నాను అన్నాడు

ఆ వ్యక్తికి అర్థం కాక నవ్వుకుంటూ వెళిపోయాడు.

దూరంగా సముద్ర తరంగాలు పడుతూ లేస్తూ...

– కథామహల్ *1999*

(దువ్వూరి శారదాంబ కథల సంపుటి)

* * * * *